క్లుప్తంగా

నాణ్యతాప్రమాణాలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: మనబడి నాడు–నేడు పనులు నాణ్యతతో చేయించాలని ఎంఈఓ కె.రాంబాబు సూచించారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో మొదటి, రెండో దశ నాడు–నేడు పనుల ప్రగతిపై సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్లతో సోమవారం సమీక్ష నిర్వహించారు. నాడు–నేడు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో రన్నింగ్ వాటర్, తలుపులు, కిటికీలు, విద్యుత్ కనెక్షన్ వంటి సదుపాయలు తక్షణమే కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 షన్ముఖరావు, మండల ఇంజినీర్ రామారావు పాల్గొన్నారు.

'చిన్నారికి చేదోడు'పై అవగాహన



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎస్‌ఐ కృష్ణప్రసాద్

సరుబుజ్జిలి: బాల్యంలో చిన్నారులు ఒత్తిడికి గురికాకుండా ఉల్లాసంగా జీవనం సాగించాలని స్థానిక ఎస్‌ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వెన్నెలవలస జవహర్‌నవోదయ విద్యాలయంలో సోమవారం చిన్నారికి చేదోడు కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నారులను ఎవరైనా చిత్రహింసలకు గురిచేస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్‌శాఖ నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతైన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపాల్ డి.రామయ్య, ఆస్కార్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.సత్యానారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని నియమించాలని వినతి



ఎంఈఓ–2కు వినతిపత్రాన్ని అందజేస్తున్న వైస్ ఎంపీపీ ఆదినాయుడు

మెళియాపుట్టి: మండలంలంలోని పరశురాంపురం పంచాయతీ పరిధిలోని నందవ జిల్లా పరిషత్ పాఠశాలలో మరో ఉపాధ్యాయుడిని నియమించాలని మండల వైస్ ఎంపీపీ ఆదినాయుడు కోరారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో ఎంఈఓ–2 పద్మనాభంను సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నందవ పాఠశాలలో 40 మంది విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయుడు ఉన్నారని, ఒకేగదిలో పాఠాలు బోధించాల్సిన పరిస్థితి ఉందన్నారు. అదనపు పాఠశాల భవనాన్ని సైతం మంజూరు చేయాలని కోరారు. ఎంఈఓ స్పందిస్తూ.. పైఅధికారులకు ఈ విషయాన్ని తెలియజేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో చందనోత్సవం



చందనాన్ని సమర్పిస్తున్న ముస్లింలు

శ్రీకాకుళం కల్చరల్: బలగలో ఉన్న పత్తేషాబి అమ్మ చందనోత్సవం ముజవర్ని షేక్ అమ్మజీ ఆధ్వర్యంలో సోమవారం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఫజర్ నమాజ్ అనంతరం ఖురాన్, సలాం పఠనం, చదర్ సమర్పరణ చేశారు. భక్తులకు లంగర్ విందు ఏర్పాటు చేశారు. జామియా మసీదు ముఫ్తీ జిల్లా ఖజీ అబ్దుల్ వహాబ్, హుస్సేని మసీద్ ఇమామ్ సుల్తాన్‌లు ప్రత్యేక అతిథులుగా హాజరవ్వగా.. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ముస్లిమ్ మైనార్టీ సభ్యులు ఎం.ఎ.రఫీ, మెహీబుల్లాఖాన్, షకుర్ ఖాన్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఎస్.కె.ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు తగరం కిరణ్‌బాబుపై వీరవల్లి పోలీసులు తప్పుడు కేసు నమోదు చేసి వేధించడం, అదే బార్ అసోసియేషన్ సభ్యుడు ఆవుల ప్రవీణ్‌కుమార్‌పై గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల దాడి చేసి గాయపరచడాన్ని నిరసిస్తూ శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరణ, ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, కార్యదర్శి పొన్నాడ రాము సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రజాప్రయోజనాలకే..

గడపగడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

పొందూరు: ప్రజాప్రయోజనాలకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని దళ్లిపేటలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బడుగు, బలహీన వర్గాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల కోసం ఎవరికీ ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని కలిసే అవకాశం ప్రభుత్వం కల్పించడ ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ప్రజలకు అన్ని విధాలా మేలు చేసే సీఎం జగన్‌ను రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని కోరారు. గ్రామంలో మురుగు కాలువలు, రోడ్లు ఏర్పాటు చేయాలని స్పీకర్‌ను ప్రజలు కోరారు. దీనిపై స్పందించిన స్పీకర్.. ఈ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, కిల్లి నాగేశ్వరరావు, సర్పంచ్ కంబాల నీలవేణి, కంబాల సూర్యారావు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, క్రీడల్లో క్రమశిక్షణ అనేది ప్రధాన అంశమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఈదులవలసలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ ఆధ్వర్యంలో జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన దివంగత ముద్దాడ విజయ వెంకటప్పలనాయుడు మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్ (అండర్–14)ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు శారీరిక దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని, విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల మక్కువ ఉండాలన్నారు. ఎంతో మంది క్రీడాకారులు మన జిల్లా నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించారని గుర్తుచేశారు. విద్యార్థులతో కొద్ది సమయం వాలీబాల్ ఆడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, నరసన్నపేట జెడ్పీటీసీ సభ్యుడు చింతు రామారావు, ముద్దాడ భాస్కరనాయుడు, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నీలం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా..

శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం



బూర్లె శ్రీనివాసరావుకు పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ఎల్.ఎన్.పేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన కొత్తూరు మండలానికి చెందిన బూర్లె శ్రీనివాసరావు జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి ప్రమాణ స్వీకరణ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ పెద్దలు, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనపై నమ్మకంతో జిల్లా కార్యదర్శి స్థానం కల్పించారన్నారు. పార్టీ విజయానికి కష్టపడి పనిచేస్తానని తెలిపారు.

224 మందికి పోడు పట్టాలిచ్చేందుకు చర్యలు

సారవకోట: మండలంలో 224 మందికి కొండ పోరంబోకు ప్రాంతాలలో పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు పట్టాలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ హనుమంతరావు సోమవారం తెలిపారు. దీంట్లో గోవర్ధనపురం రెవెన్యూ గ్రామంలో 27 మంది, జరాలి, చిన్నగుజ్జువాడ రెవెన్యూలో ముగ్గురు చొప్పున, కుమ్మరిగుంట రెవెన్యూలో 16 మంది, మహాశింగి రెవెన్యూలో 20 మంది, జమచక్రం రెవెన్యూలో 39 మంది, బొంతు రెవెన్యూలో 44 మంది, కురిడింగి రెవెన్యూలో 10 మంది, అంగూరు, పెద్దలంబ, బద్రి రెవెన్యూల్లో ఒక్కొక్కరు చొప్పున, కొమ్మసరియాపల్లిలో 46 మంది, తొగిరి రెవెన్యూ నలుగురికి పోడు పట్టాలిచ్చేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించామన్నారు.

విజేతలుగా రండి..



క్రీడాదుస్తులు అందుకున్న క్రీడాకారులతో సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: విశాఖపట్టణం, ఒంగోలులో జరగనున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో రాణించి విజేతలుగా రావాలని బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ ఆకాంక్షించారు. విశాఖలో జరగనున్న అండర్–15, ఒంగోలులో జరగనున్న అండర్–13 బాల,బాలికలకు క్రీడాదుస్తుల పంపిణీ కార్యక్రమం సోమవారం శ్రీకాకుళంలోని శాంతినగర్ కాలనీలోని ఇండోర్‌స్టేడియం వేదికగా జరిగింది. క్రీడాదుస్తులను జి.భీమారావు స్పాన్సర్ చేశారు. రాను, పోను ఖర్చులకు ఆయనతోపాటు బ్యాడ్మింటన్ సంఘం సాయం చేసింది. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, సీఈవో సంపతిరావు సూరిబాబు పాల్గొన్నారు.

జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం అర్బన్: ఈ నెల 30వ తేదీన శ్రీకాకుళంలోని నెహ్రూ యువకేంద్రం ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి కొత్తలంక సుధ సోమవారం తెలిపారు. ఎస్‌బీఐ కార్డులు, ఎంఎస్ సుస్వదీప్ ఆగ్రో సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో వివిధ ఖాళీల భర్తీలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్హతలు కలిగి 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆ రోజు ఉదయం పది గంటలకు బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తయారు చేసేందుకు నాడు–నేడు పథకం ద్వారా సరికొత్తగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. పాఠశాలలకు ప్రహరీలు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, అదనపు తరగతి గదులు.. ఇలా అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. ప్రతీ విద్యార్థి చదువుకోవాలనే తపనతో అమ్మఒడి పథకం ద్వారా తల్లుల ఖాతాలకు నిధులు జమచేస్తున్నారన్నారు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద పథకం, విద్యా దీవెన కిట్లు వంటి పథకాలు ఎన్నో అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. 2023 ఏప్రిల్ నుంచి జూన్ వరకు విద్యా దీవెన పథకంలో భాగంగా ప్రస్తుతం పాతపట్నం నియోజకవర్గంలో 4,200 మంది విద్యార్థులకు వారి తల్లుల ఖాతాల్లో రూ.4 కోట్ల 22 వేల నిధులు జమచేయటం జరుగుతుందన్నారు. ప్రతీ విద్యార్థి ఉన్నతంగా చదువుకోవాలనే ఆశయంతో సీఎం జగనన్న ఎన్నో మంచి నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. విదేశీ చదువుల కోసం వెళ్లే ప్రతిభ గల విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయం ఉంటుందన్నారు. గత ఎన్నికల ముందు సుదీర్ఘ పాదయాత్ర చేసిన సీఎం జగన్ అన్ని వర్గాల ప్రజల వారి కష్టాలు తెలుసుకుని నవరత్న పథకాలు అమల్లోకి తీసుకునివచ్చి అందరికీ మేలు జరిగేలా చేస్తున్నారన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారం కోసం తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ.. ప్రజలను మోసం చేసేందుకు గ్రామాల్లోకి వస్తున్నారని, వారి మాటలు నమ్మవద్దన్నారు. 2014 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయని చంద్రబాబుకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల వారి సంక్షేమం కోసం నిరంతరం ఆలోచిస్తున్న సీఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లోనూ మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి కోరారు.

పక్కాగా సోషల్ ఆడిట్



సూచనలిస్తున్న డ్వామా విజిలెన్స్ జిల్లా అధికారి లవరాజు

ఆమదాలవలస రూరల్: మండలంలో 30 గ్రామ పంచాయతీల పరిధిలో సోషల్ ఆడిట్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని డ్వామా విజిలెన్స్ జిల్లా అధికారి బి.లవరాజు తెలిపారు. ఆమదాలవలసలోని ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్‌లో ఎటువంటి తప్పిదాలు లేకుండా సమయానికి పూర్తి చేయాలని సూచించారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకు గ్రామ పంచాయతీల్లో సోషల్ ఆడిట్ కార్యక్రమాన్ని పూర్తిచేయాలన్నారు. సెప్టెంబర్ 8న మండలస్థాయి సామాజిక ప్రజా వేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలో 2007 నుంచి 2022 ఏడాది వరకు సోషల్ ఆడిట్ తనిఖీల్లో రికవరీ చేయాల్సిన మొత్తం రూ.6.40 లక్షలు ఉందన్నారు. కలివరం గ్రామ పంచాయతీ పరిధిలో గత ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి అత్యధికంగా రూ.4.74 లక్షలు రికవరీ చేయాల్సి ఉందన్నారు. ఉపాధి మస్టర్లలో అవకతవకలు చోటుచేసుకోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించడం జరిగిందని, రికవరీ కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ఏపీఎం లక్ష్మీనరసమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా సంబరాలు ప్రారంభం



పిరమిడ్ విన్యాసాలు చేస్తున్న విద్యార్థినులు

నరసన్నపేట: మండలంలోని సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవం సందర్భంగా సోమవారం క్రీడా సంబరాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించనున్నామని, దీంట్లో భాగంగా విద్యార్థులు పిరమిడ్ విన్యాసాలు చేశారని హెచ్‌ఎం వకులాదేవి తెలిపారు. అలాగే మాతృ భాషా దినోత్సవాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.



పిరమిడ్ విన్యాసంలో సెల్యూట్ చేస్తున్న విద్యార్థి

నగదు ప్రోత్సాహం అందజేత



విద్యార్థి తండ్రికి నగదు బహుమతి అందజేస్తున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

సారవకోట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం నగదు బహుమతులు అందించారు. ఈ పాఠశాలలో 1979–80లో పదో తరగతి చదువుకున్న సి.రాజగోపాల్ తన తల్లిదండ్రులు సీవీ కృష్ణారావు, సుశీలమ్మల జ్ఞాపకార్థం పది ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన జోగిమహంతి సందీప్, రుష్యశృంగ రీష్మలకు రూ.5 వేల చొప్పున అందించారు. పూర్వ విద్యార్థి ఎల్.శ్రీనివాసరావు తన తండ్రి పాపయ్య స్వామి జ్ఞాపకార్థం గొద్దు జశ్వంత్‌కు రూ.5 వేలు అందజేశారు. ప్రతిఏటా ఈ పాఠశాలలో చదువుకుని పది ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు తమ వంతుగా అందజేయనున్నామని పూర్వ విద్యార్థులు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ నగదు బహుమతులు అందుకునేందుకు విద్యార్థులు సుదూర ప్రాంతాలలో చదువుతుండటంతో వారి తల్లిదండ్రులకు అందజేసినట్లు హెచ్‌ఎం రామకృష్ణ తెలియజేశారు. ఉపాధ్యాయులు సత్యారావు, మురళి, నందికేశ్వరరావు, సత్యసాయి సేవా సమితి సభ్యులు బేబీరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు



కొత్తవలసలో తాగునీటి కుళాయిలకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో కొత్తవలస, పాత నిమ్మతొర్లాడ, మర్రి కొత్తవలస, నిమ్మతొర్లాడ గ్రామాల్లో రూ.2.38 కోట్ల నిధులతో నిర్మించనున్న ఇంటింటా తాగునీటి కుళాయిలకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా నియోజకవర్గంలో ఉన్న ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదిన జరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, సర్పంచ్‌లు మెట్ట నాగజ్యోతి, ఎంపీటీసీ సభ్యురాలు కూటికుప్పల ఉషారాణి, ఉప సర్పంచ్ గురుగుబెల్లి అప్పలనాయుడు, సోమరాజు శ్రీదేవి, వైస్ ఎంపీపీ సోమరాజు జగన్నాథం, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యనారాయణ, జేఈ కె.చంద్రమౌళి, పార్టీ నాయకులు సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

సత్యసాయి సంస్థల కృషి అభినందనీయం

- మంత్రి ధర్మాన ప్రసాదరావు
- స్కిల్ డెవలప్‌మెంట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, తదితరులు

శ్రీకాకుళం కల్చరల్: యువతీ, యువకులకు స్వయం ఉపాధి కల్పించేందుకు సత్యసాయి సేవా సంస్థలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక బ్యాంకర్స్ కాలనీలోని సత్యసాయి బృందావనం మేడపై స్కిల్ డెవలప్‌మెంట్ శాశ్వత భవన నిర్మాణం కోసం సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయం ఉపాధి ద్వారా నిరుద్యోగ సమస్య తగ్గించవచ్చన్నారు. ప్రతి యువత శిక్షణలో పాల్గొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణం కోసం హైదరాబాద్‌కు చెందిన హనుమంతు తులసీరావు, విశాఖకు చెందిన శ్రీలక్ష్మి చెరో లక్ష రూపాయలను విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, గొండు కృష్ణ, సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు, ప్రొఫెసర్ గుంట తులసీరావు, మందిరం కన్వీనర్ ప్రసాదరావు, డోకి జనార్ధనరావు, అప్పారావు, జి.రమణబాబు, మండవిల్లి రవి, కిల్లాన ఫాల్గుణరావు, నాగేశ్వరరావు, నర్సింహమూర్తి, ప్రమీల, సుజాత, పెద్దమందిరం కన్వీనర్ కె.మురళి, విక్రమ్‌శర్మ పాల్గొన్నారు.

తెలుగు భాష సంరక్షణకు ఉద్యమించాలి

శ్రీకాకుళం అర్బన్: తెలుగు భాషను పరిరక్షించుకోవడానికి ఉద్యమించాల్సిన అవసరం ఉందని గరిమెళ్ల విజ్ఞానకేంద్రం జిల్లా అధ్యక్షుడు వి.జి.కె.మూర్తి అన్నారు. వ్యవహారికభాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతిల ఆధ్వర్యంలో సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మాట్లాడేవారు 13 కోట్ల మంది ఉన్నారన్నారు. ఒకప్పుడు దేశంలో రెండో అతిపెద్దభాషగా వెలుగొందిన తెలుగుభాష ప్రస్తుతం నాలుగో స్థానానికి దిగజారిపోడానికి పాలకుల విధానాలే కారణమన్నారు. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్ మాటాడుతూ.. చాందసుల గుప్పెట్లో గ్రాంధికభాషగా మగ్గిపోయిన తెలుగు భాషను సామాన్యుల వ్యవహారభాషగా తేవడానికి గిడుగు, గురజాడలు ఎంతగానో కృషి చేశారన్నారు. కళాశాల తెలుగు అధిపతి పి.వి.రమణ, ప్రిన్సిపాల్ పి.సురేఖ పాల్గొన్నారు.